క్లుప్తంగా

ఏఎంసీ డైరెక్టర్‌కు సన్మానం

యాలాల: తాండూరు ఏఎంసీ డైరెక్టర్‌గా నియమితులైన కోకట్ వాసి మహమ్మద్ ముస్తఫాను మంగళవారం పలువురు గ్రామస్తులు సన్మానించారు. రైతులకు మార్కెట్‌లో ధాన్యం విక్రయాల్లో ఇబ్బందులు తలెత్తకుండా చూస్తానని ఈ సందర్భంగా ఆయన హామీ ఇచ్చారు. ఇందులో బాలకృష్ణ, శ్రీనివాస్, వేణుగోపాల్, వెంకటయ్య, మహేందర్, రమేష్‌గౌడ్ ఉన్నారు.

రేపు ఉపాధ్యాయులకు..

తాండూరు రూరల్: అంతర్జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా 15 మంది మండల స్థాయి ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం చేయనున్నట్లు ఎంఈఓ వెంకటయ్య తెలిపారు. గురువారం ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహించే ఈ కార్యక్రమానికి ఎంపీపీ అనిత ముఖ్య అతిథిగా హాజరు కానున్నారని తెలిపారు.

పీఆర్సీ బకాయి చెల్లించాలి



పాఠశాల ప్రాంగణంలో నిరసన తెలుపుతున్న ఉపాధ్యాయులు

కుల్కచర్ల: ఉపాధ్యాయులకు చెల్లించాల్సిన పీఆర్సీ బకాయిలను ప్రభుత్వం వెంటనే చెల్లించాలని యూఎస్‌పీఎస్‌సీ నాయకుడు, ముక్తవెంకటాపూర్ ప్రాథమికోన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సత్యనారాయణ కోరారు. ఈ మేరకు మంగళవారం పాఠశాల భోజన విరామ సమయంలో నిరసన తెలుపుతూ మాట్లాడారు. 18 శాతం ఉన్న ఐర్‌ను 20శాతానికి పెంచాలని, అదే విధంగా పెండింగ్ డీఏలను విడుదల చేయాలన్నారు.

గుంతలు పూడ్చివేత

యాలాల: మండల పరిధి బెన్నూరు–లక్ష్మీనారాయణపూర్ మార్గంలో ఆర్‌అండ్‌బీ ప్రధాన మార్గంలో ఏర్పడిన గుంతలను ఎంపీపీ బాలేశ్వర్‌గుప్తా పూడ్చి వేయించారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు పలు చోట్ల రోడ్డు దెబ్బతింది. ఆర్‌అండ్‌బీ అధికారులు ప్యాచ్ వర్క్ పనుల కోసం రోడ్డును తవ్వి అలాగే వదిలేశారు. దీంతో ఈ మార్గంలో రాకపోకలు సాగించే వాహనదారులు స్కిడ్‌అయి గాయాల పాలయినట్లు సమాచారం. విషయం తెలుసుకున్న ఎంపీపీ జేసీబీ సహాయంతో గుంతలను పూడ్చివేయించారు.

ఉచిత శిక్షణతో ఉపాధి పొందండి

జన్‌సహాస్ స్వచ్ఛంద సంస్థ జిల్లా కోర్డినేటర్ ప్రకాశ్




కుట్టు మిషన్ కిట్లు అందజేస్తున్న సంస్థ కోఆర్డినేటర్

పరిగి: ఉచిత శిక్షణా తరగతులను మహిళలు సద్వినియోగం చేసుకొని ఉపాధి పొందండి అని జన్‌సహాస్ స్వచ్ఛంద సంస్థ జిల్లా కోఆర్డినేటర్ ప్రకాశ్ సూచించారు. సంస్థ ఆధ్వర్యంలో పట్టణ కేంద్రంలోని న్యాక్ వారిచే నిర్వహిస్తున్న ఉచిత కుట్టు మిషన్ శిక్షణ కార్యక్రమంలో మహిళలకు మంగళవారం ట్రైనింగ్ కిట్స్ పంపిణీ చేసి మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాల్లోని నిరుపేద మహిళలకు ఈ శిక్షణ తోడ్పాటునందిస్తుందని, ఇంటి వద్దే ఉండి నేర్చుకున్న వారికి ఉపాధి దొరుకుతుందని పేర్కొన్నారు. ఒక్కో బ్యాచ్‌లో 25 మందికి శిక్షణ ఇస్తున్నామని, శిక్షణ అనంతరం ధ్రువీకరణ పత్రాలు

బస్ సౌకర్యం కల్పించాలని వినతి

దౌల్తాబాద్: విద్యాలయాల పనివేళలో ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించాలని కోరుతూ మంగళవారం వైస్ ఎంపీపీ మహిపాల్‌రెడ్డి, సర్పంచ్ భర్త రమేష్ నారాయణపేట ఆర్టీసీ డిపో అధికారులకు వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడారు. విద్యార్థుల సమస్యను దృష్టిలో ఉంచుకుని ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డి ఆదేశాల మేరకు డిపో అధికారులను కలిశామని తెలిపారు. స్పందించిన సంస్థ అధికారులు విద్యాలయాల వేళలో సర్వీసులను నడిపిస్తామని హామీ ఇచ్చినట్లు తెలిపారు.

విద్యార్థులకు ట్యాబ్‌ల అందజేత



విద్యార్థులకు ట్యాబ్‌లు అందజేస్తున్న స్మిత

యాలాల: పలువురు విద్యార్థులకు ప్రముఖ గాయని స్మిత ట్యాబ్‌లను పంపిణీ చేశారు. చదువులో వారిని ప్రోత్సహించాలనే ఉద్దేశంతో అల్లి(గుడ్ స్కూల్ ట్యాబ్) స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ట్యాబ్‌లను అందజేశారు. హరివిల్లు ఫౌండేషన్ ఆధ్వర్యంలో మండల పరిధి ఉన్నత పాఠశాలల్లో పలువురు విద్యార్థులను ఎంపిక చేశారు. వీరికి నగరంలోని హైటెక్ సిటీ సమీపాన ఎన్ కన్వెన్షన్ సెంటర్‌లో మంగళవారం గాయకురాలు స్మిత, నటులు నాని, అడివి శేష్‌లు ట్యాబ్‌లు అందజేశారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ ప్రతినిధులు, ఉపాధ్యాయుడు మురహరినాథ్‌కు విద్యార్థుల తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలిపారు.

మూగ వేదన.. అరణ్య రోదన

- సిబ్బందిలేక మూతపడిన వైద్యశాల
- చికిత్స అందక మృత్యువాత పడుతున్న పశువులు
- ఆందోళనలో అన్నదాతలు



తాళం వేసి ఉన్న పశువుల ఆసుపత్రి

ధారూరు: అసలే సీజనల్ వ్యాధుల కాలం. ఆపై స్థానికంగా ఉన్న పశు వైద్యశాల సిబ్బంది లేమీతో మూత పడింది!. దీంతో పశు సంపదకు సకాలంలో వైద్య చికిత్స అందక.. మూగ వేదన అరణ్య రోదనగా మారింది. వివరాలు ఇలా ఉన్నాయి. మంగళవారం కొందరు రైతులు తమ పశువులను వైద్య పరీక్షల కోసం స్థానికంగా ఉన్న పశు ఆసుపత్రికి తీసుకెళ్లగా దానికి తాళం వేసి ఉంది. దీంతో ప్రైవేటు సిబ్బందిని ఆశ్రయించి చికిత్స చేయించారు. అనంతరం రైతులు మాట్లాడారు. అవుట్ సోర్సింగ్ అటెండర్‌గా విధులు నిర్వహిస్తున్న బాబురావును ఆగస్టులో ప్రభుత్వం విధుల నుంచి తొలగించింది. అతని స్థానంలో వీఆర్ఏను నియమించింది. కొత్తగా నియమితులైన అటెండర్ సమయ పాలన పాటించకపోవడం.. మూగజీవాల పాలిట శాపంగా మారింది.

దవాఖానాలు ఐదు.. వైద్యుడు ఒక్కడు

ఐదు ఆస్పత్రులకు యాలాల మండలానికి చెందిన ఒకే పశు వైద్యుడు ఉండటంతో ఇబ్బందిగా మారిందని, సమయానికి చికిత్స అందక పశువులు, గొర్రెలు, మేకలు చనిపోతున్నాయని రైతులు విచారం వ్యక్తం చేశారు. ధారూరు పశువైద్య ఆసుపత్రి పరిధిలో నాగారం, కేరెళ్లి సబ్ సెంటర్లు, నాగసమందర్ పరిధిలో మున్నూరు సోమారం, కుక్కింద సబ్ సెంటర్లు ఉన్నాయి. ప్రధాన ఆసుపత్రులతో పాటు సబ్ సెంటర్ల అవుట్ సోర్సింగ్ సిబ్బందిని తొలగించడంతో అవి మూతపడి పశువులకు వైద్యం అందడం లేదని చెబుతున్నారు. డాక్టర్లు రాకున్నా అవుట్‌సోర్సింగ్ సిబ్బంది వైద్యం చేసేవారని చెప్పారు. ప్రస్తుతం పనిచేస్తున్న 1962 మొబైల్ వాహనానికి ఫోన్లు చేసినా.. రావడం లేదని రైతులు ఆరోపించారు. నాలుగు రోజుల క్రితం లంపిస్కిన్ వ్యాధి సోకిన లేగదూడ, సకాలంలో వైద్యం అందకపోవడంతో చనిపోయిందని ధారూరుకు చెందిన చెంగోల్ శ్రీనివాస్ ఆవేదన వ్యక్తం చేశారు. రోగాల బారిన పడిన పశువులకు వైద్యం అందుబాటులో ఉండేలా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

ఉపాధ్యాయ వృత్తి గౌరవప్రదమైనది

జెడ్పీటీసీ మధుకర్



ఉపాధ్యాయులను సన్మానిస్తున్న జెడ్పీటీసీ మధుకర్

మర్పల్లి: ఉపాధ్యాయ వృత్తి సమాజంలో ఎంతో గౌరవప్రదమైనదని జెడ్పీటీసీ పట్నే మధుకర్ అన్నారు. మంగళవారం పట్లూర్ రైతు వేదికలో ఉత్తమ ఉపాధ్యాయులను సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. టీచర్లు అంకిత భావంతో పనిచేస్తేనే సమాజంలో గుర్తింపు లభిస్తుందని, విద్యార్థులను భావి భారతపౌరులుగా తీర్చిదిద్దే గురుతర బాధ్యత వారిదేనని చెప్పారు. ప్రభుత్వ బడుల్లో కార్పొరేటు పాఠశాలకు దీటుగా విద్యాబోధన జరుగుతుందని పేర్కొన్నారు. అనంతరం జిల్లా స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయులుగా అవార్డులు అందుకున్న నలుగురు ఉపాధ్యాయులకు, మండల స్థాయిలో ఉత్తమ అవార్డులు అందుకున్న 16 మందికి, 3 సీఆర్‌పీలకు అవార్డులతో పాటు ప్రశంసా పత్రాలు, జ్ఞాపికలు అందజేశారు. కార్యక్రమంలో ఎంఈఓ విద్యాసాగర్, పట్లూర్, మర్పల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల హెచ్‌ఎంలు లాలయ్య, గణేశ్, మండల పరిషత్ సూపరింటెండెంట్ కృష్ణరావు, ఎస్ఐ శ్రీధర్‌రెడ్డి, సర్పంచ్ ఇందిర, హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బీసీలకు 50 శాతం రిజర్వేషన్లు కల్పించాలి

మర్పల్లి: చట్టసభల్లో బీసీలకు 50 శాతం రిజర్వేషన్లు కల్పించాలని టీఎస్‌ఈడబ్ల్యూడీసీ మాజీ చైర్మన్ నాగేందర్‌గౌడ్ డిమాండ్ చేశారు. మంగళవారం మండల కేంద్రంలో బీసీ నాయకులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాజకీయ పార్టీలు బీసీలను ఓటు బ్యాంకుగా వాడుకుంటున్నాయని ఆరోపించారు. రాజ్యాధికారంలో వాటా ఇవ్వకుండా మోసం చేస్తున్నాయని మండిపడ్డారు. జనాభాలో 56శాతం బీసీలు ఉంటే.. చట్టసభల్లో 14 శాతం రిజర్వేషన్లు కల్పించడం అన్యాయమన్నారు. బీసీ ఉద్యోగులకు పదోన్నతుల్లో రిజర్వేషన్లు కల్పించేలా రాజ్యాంగ సవరణ బిల్లును పార్లమెంటులో ప్రవేశ పెట్టాలని ఆయన కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అనంతరం బీసీ మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా శేఖర్‌యాదవ్, కన్వీనర్‌గా రమేష్‌గౌడ్, ఉపాధ్యక్షుడిగా అశోక్, కార్యవర్గ సభ్యులు వీరేశంగౌడ్, సురేష్‌యాదవ్, శ్రీశైలంగౌడ్‌లను ఎన్నుకున్నారు. ఇందులో రాములు, ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు తుల్జారాంగౌడ్, గౌడ్ సంఘం జిల్లా అధ్యక్షుడు మల్లికార్జున్ గౌడ్ ఉన్నారు.

‘ప్రత్యేక’ నిధులతో గ్రామాభివృద్ధి



సీసీరోడ్డు పనులను ప్రారంభిస్తున్న సర్పంచ్ రత్నమ్మ తదితరులు

యాలాల: ప్రత్యేక అభివృద్ధి నిధులతో గ్రామం అభివృద్ధి చెందుతుందని అన్నసాగర్ సర్పంచ్ రత్నమ్మ అన్నారు. మంగళవారం ఎస్‌డీఎఫ్ నిధులతో చేపట్టిన సీసీరోడ్డు నిర్మాణ పనులను ఆమె ప్రారంభించి మాట్లాడారు. ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి చొరవతో మంజూరైన నిధులతో గ్రామంలో అవసరమైన చోట సీసీ, డ్రైనేజీ నిర్మాణాలను చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. ఇందులో మాజీ సర్పంచ్ బోయిని సాయిలు, రవికుమార్ ఉన్నారు.

ముద్దాయిపేటలో..

మండల పరిషత్ నిధులతో ముద్దాయిపేటలో సీసీ రోడ్డు పనులను ఎంపీటీసీ దేవగారి రాములు, సర్పంచ్ కృష్ణయ్యగౌడ్ ప్రారంభించారు. ఇందులో వార్డు సభ్యుడు రవీందర్, గ్రామస్తులు రాజప్ప, సురేష్ తదితరులు ఉన్నారు.

ప్రజా సంక్షేమమే లక్ష్యం

- అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పని చేయాలి
- సర్వసభ్య సమావేశంలో ఎమ్మెల్యే ఆనంద్



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆనంద్

అనంతగిరి: ప్రజా సంక్షేమమే లక్ష్యంగా ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఎమ్మెల్యే ఆనంద్ అన్నారు. మంగళవారం శ్రీ శక్తి భవన్లో ఎంపీపీ చంద్రకళ అధ్యక్షతన జరిగిన మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. సంక్షేమ పథకాలు అర్హులకు అందేలా చూడాలన్నారు. పలువురు సర్పంచ్‌లు మాట్లాడుతూ గ్రామాల్లో విద్యుత్ సమస్యలు ఉన్నాయని, వెంటనే పరిష్కరించాలని సభ దృష్టికి తెచ్చారు. అదే విధంగా రేషన్ షాపులు సమయానికి తెరుచుకునేలా చొరవ చూపాలని తమసీల్దార్ లక్ష్మీనారాయణను కోరారు. సీజనల్ వ్యాధుల బారిన ప్రజలు పడకుండా వైద్యాధికారులు మెడికల్ క్యాంపులు నిర్వహించాలని కోరారు. మండలంలో రెవిన్యూ సమస్యలను పరిష్కరించాలని కో ఆప్షన్ సభ్యుడు జాఫర్ కోరారు. అనంతరం ఎంపీపీ మాట్లాడుతూ ప్రజాప్రతినిధులు సూచించిన సమస్యలపై అధికారులు దృష్టి సారించి, వెంటనే పూర్తి చేయాలని ఆదేశించారు. తమ పరిధిలో ఉన్న వాటిని పూర్తి చేయాలని, ఉన్నతాధికారుల స్థాయిలో ఉంటే వారికి తెలపాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సత్తయ్య, పీఏసీఎస్ చైర్మన్ ముత్యంరెడ్డి, పీఆర్డీఈ మాధవరెడ్డి, సర్పంచ్ల సంఘం మండల అధ్యక్షుడు పురుషోత్తంరెడ్డి, ఎంపీఓ నాగరాజు, ఏపీఓ శ్రీనివాస్, ఎంఈఓ బాబు సింగ్, పీఆర్ ఏఈ చాణక్య రెడ్డి, ఏపీఎం లక్ష్మయ్య, సిద్దులూర్ ఎంపీటీసీ గౌస్, సర్పంచ్‌లు మాధవరెడ్డి, మోహన్ బుచ్చిరెడ్డి, తిరుపతి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సకాలంలో పన్ను వసూలు చేయండి

పండ్ల తోటలను ప్రోత్సహించాలి
ఎంపీడీఓ శైలజారెడ్డి



సమావేశంలో ఎంపీడీఓ శైలజారెడ్డి

మోమిన్‌పేట: ఆస్తి పన్నులు సకాలంలో వసూలు చేయాలని ఎంపీడీఓ శైలజారెడ్డి అన్నారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో కార్యదర్శులు, ఎస్‌ఆర్‌ఈజీఎస్ సిబ్బందితో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. నిత్యం గ్రామాల్లో పర్యటిస్తూ ఆస్తి పన్ను వసూలు చేయాలని ఆదేశించారు. సీజనల్ వ్యాధుల ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. పక్షం రోజులకు ఒకసారి నీటి ట్యాంకులను శుభ్రం చేయించాలని చెప్పారు. క్రీడా పరికరాలు, బతుకమ్మ చీరలను తీసుకువెళ్లి పంపిణీ చేయాలని పేర్కొన్నారు. ఎన్‌ఆర్‌ఈజీఎస్‌లో పండ్ల తోటల పెంపకాన్ని ప్రోత్సహించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీఓ యాదగిరి తదితరులు ఉన్నారు.

రోడ్డు పనులు ప్రారంభం

తాండూరు రూరల్: మండల పరిధి కరన్‌కోట్ నుంచి ఓగిపూర్ వరకు రోడ్డు పనులు ప్రారంభమయ్యాయి. గతంలో ఈ రోడ్డు మరమ్మతులకు ప్రభుత్వం రూ.3.50 కోట్లు మంజూరు చేసిందని, కాంట్రాక్టర్ అందుబాటులో లేకపోవడంతో పనులు ఆలస్యమయ్యాయని పంచాయతీరాజ్ ఏఈ నందిని తెలిపారు. మూడు రోజుల్లో పనులు పూర్తి అవుతాయని చెప్పారు.

ఏపీఓగా నర్సింహులు

పెద్దేముల్: ఉపాధిహామీ ఏపీఓగా నర్సింహులు మంగళవారం ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. పెద్దేముల్‌లో పని చేసిన ఏపీఓ లక్ష్మీదేవి నవాబ్‌పేట మండలానికి బదిలీపై వెళ్లారు. గతంలో ఇక్కడ పనిచేసిన నర్సింహులు.. మండలంలో జరిగిన ఉపాధి పనులపై సరైన సమాచారం ఇవ్వక పోవడంతో అప్పట్లో జిల్లా అధికారులు ఆయన్ను సస్పెండ్ చేశారు. మళ్లీ ఆయనకే బాధ్యతలు అప్పగించినట్లు ఎంపీడీఓ లక్ష్మప్ప తెలిపారు. అదే విధంగా గతంలో సస్పెండ్‌కు గురైన ఫీల్డ్ అసిస్టెంట్ సిద్దును కూడా ఉన్నతాధికారులు విధుల్లోకి తీసుకున్నారు. ఆయన ఇక్కడే ఫీల్డ్ అసిస్టెంట్‌గా పని చేస్తారని సంబంధిత అధికారులు పేర్కొన్నారు.

ఘాటెక్కిన ఉల్లి.. కిలో రూ.40

పెద్దేముల్: ఉల్లి ధర క్రమంగా పెరుగుతోంది. మంగళవారం మండల కేంద్రంలో జరిగిన వారాంతపు సంతలో కిలో ఉల్లి రూ.40 పలకగా.. అల్లం వెల్లుల్లి రూ.160 నుంచి రూ.180 వరకు విక్రయించారు. రానున్న రోజుల్లో ఉల్లిగడ్డ మరింత ఘాటెక్కనుందని వ్యాపారులు చెప్పారు.

ఏఎన్ఎంల ముందస్తు అరెస్టు



పోలీసుల అదుపులో ఏఎన్ఎంలు

యాలాల: డిమాండ్ల సాధనకోసం ఏఎన్ఎంలు చేపట్టిన ‘ఛలో హైదరాబాద్’ కార్యక్రమానికి ముందే మంగళవారం పోలీసులు వారిని అరెస్టు చేసి పీఎస్‌కు తరలించారు. ఈ సందర్భంగా పలువురు ఏఎన్ఎంలు మాట్లాడారు. సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సమ్మె చేస్తున్న నేపథ్యంలో.. తమ సమస్యల పరిష్కారానికి కమిటీ వేస్తామని ప్రభుత్వం ప్రకటించినప్పటికీ.. నేటికీ వేయలేదని మండిపడ్డారు. ఇందులో భాగంగానే తాము ఛలో హైదరాబాద్ కార్యక్రమానికి శ్రీకారం చుట్టామని, కానీ.. పోలీసులు తమను ముందస్తు అరెస్టు చేశారని మండిపడ్డారు. ఇందులో ఏఎన్ఎంలు వెంకటమ్మ, లక్ష్మి, శ్రీదేవి, జగదేవి, లీలావతి, రోజారమణి ఉన్నారు.

అరెస్టు.. విడుదల

పెద్దేముల్: డిమాండ్ల సాధనకోసం ఏఎన్ఎంలు తలపెట్టిన ధర్నాకు వెళ్లకుండా పోలీసులు వారిని ముందస్తు అరెస్టు చేసి, అనంతరం విడుదల చేసినట్లు ఎస్ఐ కాశీనాథ్ తెలిపారు.

బస్సు కోసం విద్యార్థుల ధర్నా



ధర్నాలో పాల్గొన్న విద్యార్థులు

రెండురోజుల్లో సమస్య పరిష్కరిస్తామని
ఆర్టీసీ అధికారుల హామీ

దౌల్తాబాద్: విద్యాలయాల పనివేళలో ఆర్టీసీ బస్సు రావడం లేదని మంగళవారం మండల కేంద్రం అంబేడ్కర్ చౌరస్తాలో ప్రభుత్వ కళాశాల విద్యార్థులు ధర్నా చేశారు. వీరికి యువజన కాంగ్రెస్ నాయకులు రెడ్డిశ్రీనివాస్, మహిపాల్, కాశీ మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా యువజన నాయకులు, విద్యార్థులు మాట్లాడారు. బస్సులు సమయానికి రాకపోవడంతో చదువుకు ఆటంకం కలుగుతుందని వాపోయారు. రోడ్డుపై రెండు గంటల పాటు ధర్నా చేయడంతో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగింది. దీంతో పోలీసులు వచ్చి ధర్నా విరమించాలని కోరారు. ససేమిరా అనడంతో కొడంగల్ సీఐ రాములు వచ్చి సముదాయించారు. అయినా వినకపోవడంతో బలవంతంగా విరమింపజేశారు. అనంతరం విద్యార్థులను ఆర్టీసీ అధికారులతో మాట్లాడించారు. రెండు రోజుల్లో విద్యాలయాల వేళలో బస్సు నడిపించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

ఆశల సమస్యలు పరిష్కరించాలి



ఎంపీడీఓ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న ఆశవర్కర్లు

సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనివాస్

తాండూరు రూరల్: ఆశ వర్కర్ల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనివాస్ డిమాండ్ చేశారు. మంగళవారం ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో ఆశల సమ్మెకు ఆయన మద్దతు తెలిపి మాట్లాడారు. కరోనా సమయంలో ప్రాణాలకు తెగించి విధులు నిర్వహించారని పేర్కొన్నారు. ఆశలకు కనీస వేతన రూ.18 వేలు ఇవ్వాలని, హెల్త్ కార్డులు అందజేయాలని కోరారు. ఇందులో ఆశలు రాజమణి, సుజాత, రమాదేవి, అంజమ్మ, సరిత, శ్రీదేవి తదితరులు ఉన్నారు.

ఆత్మహత్యాయత్నం!

అధికారుల వేధింపులు తాళలేక మండల పరిధి గౌతపూర్ గ్రామానికి చెందిన ఆశ వర్కర్ రాధమ్మ ఆత్మహత్యాయత్నానికి యత్నించినట్లు సమాచారం. ఈ సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. అధికారుల వేధింపులను అరికట్టాలని ఆశలు డిమాండ్ చేశారు.

వివరాలు వెల్లడించడం.. వెళ్లిపోవడం

- ఇదేనా అధికారుల పనితీరు?
- ప్రజాసమస్యలు సభలో ప్రస్తావించినా పరిష్కారం దొరకదు
- సర్వసభ్య సమావేశంలో సభ్యుల ఫైర్
- ఈకేవైసీతో ఇబ్బంది పడుతున్న లబ్ధిదారులు: సర్పంచ్‌లు



సర్వసభ్య సమావేశంలో వివరాలు వెల్లడిస్తున్న అధికారులు

యాలాల: ‘ఒక్కొక్కరుగా అధికారులు తమ శాఖ ఎజెండాలోని వివరాలను చదివి వినిపించడం.. వెళ్లిపోవడం.. ఇదేనా సర్వసభ్యం సమావేశం తీరు. ప్రజా సమస్యల గురించి సభలో సభ్యులు పలుమార్లు సంబంధిత అధికారుల దృష్టికి తెచ్చినా.. వాటికి పరిష్కారం చూపరు. అసలు సభకు అధికారులు సరిగా రావడమే లేదు. వచ్చినా ఉపయోగం లేకుండా పోయింది’ అని సర్పంచ్‌లు ఆరోపించారు. మంగళవారం మండల పరిషత్ సమావేశ మందిరంలో జరిగిన సర్వసభ్య సమావేశంలో మొదటగా.. వ్యవసాయ శాఖ ఏఓ యాదగిరి మాట్లాడారు. రైతుబీమాలో సాంకేతిక కారణాలతో 9 మందికి బీమా చెల్లింపులు నిలిచాయని సభ దృష్టికి తెచ్చారు. ఈ ఏడాదిలో 23 మంది రైతులు చనిపోగా.. రైతుబీమా దరఖాస్తు ప్రక్రియ పూర్తి చేశామని, త్వరలో చెల్లింపులు జరిగే అవకాశం ఉందని చెప్పారు. ఈ సారి మండలంలో వరి సాగు రెండింతలు పెరిగిందని, కంది, పత్తి పంట, మినుము లాంటి పంటలపై రైతులు మొగ్గు చూపడం లేదని పేర్కొన్నారు.

రేషన్ డీలర్లు లేక..

కొత్తగా ఏర్పడిన పంచాయతీల్లో ప్రత్యేక డీలర్లు లేక, గతంలో మాదిరి పొరుగు జీపీల్లో సరుకులు తీసుకోవాల్సి వస్తుందని కిష్టాపూర్ సర్పంచ్ ప్రవీణ్‌కుమార్ సభ దృష్టి తెచ్చారు. పలుమార్లు సభలో ప్రస్తావించినప్పటికీ.. పరిష్కారం కావడం లేదని ఆరోపించారు. రేషన్‌కార్డుల్లో లబ్ధిదారుల ఈకేవైసీ సమస్య తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తుందని ముద్దాయిపేట సర్పంచ్ కృష్ణయ్య గౌడ్ అన్నారు. అచ్యుతాపూర్ ఊరచెరువు అలుగు పూర్తిగా దెబ్బతిన్నదని ఆ గ్రామ సర్పంచ్ మధుసూదన్‌రెడ్డి ఇరిగేషన్ డీఈ దృష్టికి తీసుకువచ్చారు. అచ్యుతాపూర్, జుంటుపల్లి తదితర గ్రామాలకు అసంపూర్తిగా మిగిలిన బీటీ రోడ్డు పనులను త్వరగా పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటామని పీఆర్ ఏఈ సంతోష్ సభకు తెలిపారు.

ఏఎంసీ చైర్‌పర్సన్‌కు సన్మానం

సమావేశానికి ముఖ్య అతిథిగా వచ్చిన తాండూరు ఏఎంసీ చైర్‌పర్సన్ వీణ, శ్రీనివాసచారీ దంపతులను మండల పరిషత్ తరఫున సన్మానించారు. అనంతరం గ్రామీణ క్రీడా మైదానాల పనులు పూర్తయిన పంచాయతీలకు క్రీడా సామగ్రిని పంపిణీ చేశారు. కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ సురేందర్‌రెడ్డి, వైస్ ఎంపీపీ రమేశ్, ఎంపీడీఓ పుష్పలీల, మాజీ ఎంపీపీ కరణం పురుషోత్తంరావు, ఇరిగేషన్ డీఈ కిష్టప్ప తదితరులు ఉన్నారు.

సంక్షిప్త వార్తలు

పరిగిలో ఎగిరేది టీడీపీ జెండానే

కుల్కచర్ల: పరిగి నియోజకవర్గంలో ఎగిరేది టీడీపీ జెండాయేనని టీడీపీ రాష్ట్ర నాయకుడు బాలముకుందం అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణలో టీడీపీ రాకకోసం ప్రజలు ఎదురుచూస్తున్నారని చెప్పారు. బడుగుబలహీన వర్గాల ప్రజలకు మేలు చేసేది ఒక్క తెలుగుదేశం పార్టీ మాత్రమేనని చెప్పారు.

ఐఆర్‌ను 20శాతానికి పెంచాలి

పరిగి: ప్రభుత్వ ఉద్యోగులకు ప్రభుత్వం ప్రకటించిన ఐఆర్‌ను 20శాతానికి పెంచాలని మంగళవారం పట్టణ కేంద్రంలోని నంబర్1 పాఠశాల ఉపాధ్యాయులు నిరసన వ్యక్తంచేశారు. 5శాతం ఐఆర్ ఇవ్వడం ప్రభుత్వ ఉద్యోగులను అవమాన పరిచినట్టు ఉందన్నారు. ఉద్యోగులు నిరసన బాట పట్టకముందే ఐఆర్‌ను పెంచాలని డిమాండ్ చేశారు.

రాష్ట్రంలో కాంగ్రెస్‌దే అధికారం

బంట్వారం: రానున్న ఎన్నికల్లో తెలంగాణలో కాంగ్రెస్‌దే అధికారమని యూత్ కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి హరీశ్వర్‌రెడ్డి ఆశాభావం వ్యక్తం చేశారు. జోడో కార్యక్రమంలో భాగంగా మంగళవారం మండల పరిధి బొప్పునారంలో ఆయన ఎంపీపీ ప్రభాకర్‌తో కలిసి ఇంటింటి ప్రచారం చేశారు. అనంతరం మాట్లాడారు. అధికారంలోకి రాగానే 6 గ్యారంటీ పథకాలు అమలు చేస్తామని పేర్కొన్నారు.

‘అగ్నిపథ్’ ఎంపికైన వారికి సన్మానం

దోమ: దేశ సేవలో గ్రామ యువకులు భాగస్వాములు కావడం హర్షించదగిన విషయమని సర్పంచ్ మల్లేశం అన్నారు. దోమ మండలం ఐనాపూర్ గ్రామానికి చెందిన రమేశ్, గణేశ్ ‘అగ్నిపథ్’ ఆర్మీ ఉద్యోగానికి ఎంపిక కాగా.. వారిని మంగళవారం సన్మానించారు. ఇందులో ఉపసర్పంచ్ బుగ్గయ్య, ఉపాధ్యాయుల సంఘం జిల్లా అధ్యక్షుడు రామకృష్ణ ధనేశ్వర్, ముదిరాజ్ సంఘం మండల ప్రధానకార్యదర్శి చందు ఉన్నారు.

గిరిజన తండాలకు రోడ్లు

బొంరాస్‌పేట: నియోజకవర్గంలోని గిరిజన తండాలకు ప్రభుత్వం రోడ్లు నిర్మిస్తుందని ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి చెప్పారు. మంగళవారం మండల పరిధి కొత్తూరు పంచాయతీ రాము నాయక్‌తండాలో జాతీయ రహదారి నుంచి తండాకు సీసీరోడ్డు నిర్మాణ పనులను ఎమ్మెల్యే ప్రారంభించారు.

చిన్నారికి లక్కీడిప్‌లో మహాప్రసాదం

కొడంగల్: హైదరాబాద్ శేరిలింగంపల్లిలో నెలకొల్పిన వినాయకుడి మంటపంలో మంగళవారం లడ్డూను వేలం వేయగా.. కొడంగల్ పట్టణానికి చెందిన బాలుడు గోపాలకృష్ణ గణేశుడి చేతిలోని లడ్డూను ఉచితంగా పొందాడు. ఈ విషయంపై బాలుడి తండ్రి మురహరి వశిష్ట మట్లాడుతూ.. నిర్వాహకులు లక్కీడిప్ ద్వారా వేలం వేశారని, ఇందులో ఎంతో మంది భక్తులు పాల్గొనగా.. గోపాలకృష్ణకు మహాప్రసాదం దక్కిందని చెప్పారు.